# ఐక్యసాధన

మాను దిద్ద వచ్చు మరి వంపు లేకుండ
దిద్దవచ్చు రాయ తిన్నగాను
మనసు దిద్దగలర మరి వంపు లేకుండ
ఉన్న మాట తెలుపుచున్న మాట.

ప్రేమస్వరూపులారా! ఈనాడు యావద్భారతదేశమునకు పవిత్రమైన పర్వదినము. దీని పేరు మహాశివరాత్రి. రాత్రి అనగా చీకటితో కూడినది. ప్రతి నిత్యమూ చీకటితోకూడిన రాత్రిని అనుభవిస్తూనే వున్నాము. కానీ, ఈనాడు వట్టి రాత్రి కాదు. శివరాత్రి. మంగళకరమైనట్టి రాత్రి. మహామంగళమైనది. మంగళము ఒక్క దైవత్వమునుంచే ఏర్పడినదిగాని లోకసంబంధమైన కార్యకలాపములతో కలిగేది కాదు. ఇది శివత్వానికి సంబంధించినది. దైవత్వమునకే తగినది. అన్యపదార్థములతో చేరినది కాదు. ఇది శివత్వానికి సంబంధినిచినది. సత్యం, శివం, సుందరం. సత్యము, మంగళము, అందము మూడూ మార్పుచెందనివి.

సర్వరూపధరం సఆంతం, సర్వనామధరం శివం
సచ్చిదానందరూపమద్వైతం, సత్యంశివంసుందరం.

మంగళత్వమును, శివత్వమును మనము గుర్తించటానికి ప్రయత్నము చేయాలి. కంటికి కనిపించే దృశ్యములు అనేకముగా వున్నాయి. పర్వతములు శిలామయములు, భూమి మృణ్మయము,వృక్షములు కాష్టమయము, దేహము మాంసమయము. మానవుడు జీవనోపాధి నిమిత్తమై,దీనికి కొన్ని రూపనామములు కల్పించి అనుభవించుచున్నారేగానీ ఇవి పంచభూత వికారములే. జగత్తులో విచిత్రమైన వస్తువు అనేదే కనిపించదు. సర్వమూ వికార స్వరూపములే. కాని, తాను గుర్తించకపోయినప్పటికీ, నిత్యసత్యమైన శివతత్త్వము లర్వులయందు ప్రకాశించుచునే వున్నది. కారుణ్యానంద చెప్పినట్లుగా (సంసారం సాగరం విషం) ఈ సాగరములో మునిగాము. సాగరమునకున్న లక్షణములన్నీ సంసారమునకు వుంటున్నాయి. ఈ ప్రపంచములో ఏది చూచినా మన భావములకూ, ఊహలకూ, ఇచ్చలకూ విరుద్ధమైనవిగానే రూపొందుతున్నాయి. మనకు ఇష్టముండినంతవరకు ఏది చేసినా అది మంచిగానే కనిపిస్తుంది. ఇష్టమేమైనా మారిపోయేనా మంచివికూడా చెడ్డగా రూపొందుతాయి.

ఈ జగత్తులో ఏది ఇష్టమని, ఏధి అయిష్టమని నిర్ణయించే అధికారము ఎవ్వరికీ లేదు. విరోధిని వెంటబెట్టుకొని పగటిపూట పోయినా ప్రమాదం వస్తుంది. కటిక చీకటిలో ఒంటరిగా పోయినప్పుడు భయము వుండవచ్చుగాని ప్రమాదము సంభవించదు. మనయందు విరోధభావములు క్షణక్షణమూ చెదల పుట్టలవలె పుట్టుచున్నవి. ఇలాంటి దుర్భావములను, దుర్గుణములను, దురుద్దేశములను దూరం చేసుకొనే నిమిత్తమై మన సత్యత్వాన్ని మనం గుర్తించాలి.

దినికి ఓపిక పట్టాలి. ప్రప్రమధమములో ఓపిక అతి చేదుగా వుంటుంది. కాని, దాని ఫలితము అతి మధురము. కనుకనే, మనకు విరోధము చేసినవానినైననూ, అపకారము చేసినవానిని, అపనిందలలో ముంచినవానిని, అన్యాయము చేసినవానిని క్షమించటమేప్రధాన లక్ష్యము. దీనిని పురస్కరించుకొనియే భగద్గీతయందు 'అద్వేష్టా సర్వభూతానాం' అని చెప్పబడినది. మానవుడు ఆనందనిమిత్తమై అనేక విధములైన సాధనలు సల్పి, ఆయా మార్గములయందు ప్రవేసించి, ప్రయత్నించుచున్నాడు. నిజముగా ఇది ఆనందము ఎక్కడ వున్నదీ గుర్తించుకోలేని వ్యక్తి పూనుకొనే ప్రయత్నము. 'నా కంటి అద్దాలు ఎక్కడో పోయినాయని' ఇల్లంతా వెదిగి, చివరికి, 'అయ్యో! నా ముక్కు పైనే వున్నాయ'ను కొన్నాడుట. ఆనందము అక్కడవుంది, అక్కడ వుంది అని వెదకి వెదకి చివరకు 'అరే!నాయందే వుంది' అనే సత్యాన్ని నిరూపించేదే భక్తి. కారుణ్యానంద చెప్పాడు,' సమిష్టి భజన, వ్యష్టి భజన' అని. సమిష్టి భజన అనగా అనేకమంది చేరి, భగవన్నామ చింతన చేయటము అని. అయితే ఇక్కడ వేరు భావాన్ని చూపాడు. కొన్ని అరటి తోటలు వేసి, నిర్ణీత కాలము లోపలే వాటిని అమ్మటానికి ప్రయత్నము చేసి,చిన్నచిన్న పిందెలను కూడా పెరికి, దానికి పచ్చని రంగు వచ్చేటట్లుగా చేసి, అమ్మివేస్తున్నారు. అయితే, పసుపు రంగు వస్తున్నాదిగాని, మాధుర్యము రావటము లేదు. చెడిన పాలకు పెరుగు రుచి వస్తుందా! కావున, ఇది ఒకరకంగా మోసం చేసినట్లవుతుంది. సమిష్టి భజనలో హృదయపూర్వకంగా భజన చేయాలిగానీ, ఏదో పదిమంది చేస్తున్నారుకదాయని ఊరికే చప్పట్లు కొడితే సరిపోదు. హృదయపూర్వకంగా చేయాలి. అప్పుడు పరిపక్వమౌతుంది. ఈవిధమైన భజనలద్వారా, సాధనద్వారా మనలోని సత్యత్వాన్ని, ప్రేమతత్త్వాన్ని, దివ్యత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నం చేయాలి.

ఇక్కడ చిన్న ఉదాహరణ. వైజ్ఞానిక శాస్త్రమందుగానీ, ఆధ్యాత్మిక శాస్త్రమందుగానీ, ధార్మిక శాస్త్రమందుగానీ పంచభూతముల కంటే మరొకటి లేదని, పంచభూతములు పరమాత్ముని అంశములని నిర్ణయించారు. అయితే, ఈ పంచభూతములందు పరమాత్ముని అంశము ఏ రూపమున వున్నది? దీనిని గుర్తించినప్పుడు, పంచభూతములను ఎవరూ

వృధాచేయరు. దుర్వినియోగ పరచరు.

మొట్టమొదటిది పృధ్వీభూతము. పృధ్వీభూతమునందు చైతన్యస్వరూపమై వుంటున్నది దైవత్వము. రెండవది జలభూతమునందు ప్రజ్ఞాస్వరూపమై వుంటున్నది. దాహముచేత తాను అన్నివిధములా కృశించి, కొంత మైమరచిపోతాడు. ఆ సమయములో ఎక్కడ పడుతున్నాను, ఏమి చేస్తున్నావీ అనేది తెలియదు. చల్లటి నీరు టక కప్పు ఇవ్వండి, త్రాగిన వెంటనే ప్రజ్ఞ వస్తుంది. కనుకనే, జలభూతమునందు ప్రజ్ఞారూపములో వున్నాడు పరమాత్మ. ఇంక అగ్నిభూతము. అగ్నిభూతమునందు హెచ్చరిక, తస్మాత్ జాగ్రత, తస్మాత్ జాగ్రత స్వరూపముతో వున్నాడు పరమాత్మ. గాలి నాల్గవ భూతము. గాలియందు ప్రాణస్వరూపుడై వుంటున్నాడు పరమాత్మ. ప్రాణమే లేకపోతే గాలి నిరుపయోగము. ఐదవది ఆకాశము. ఆకాశభూతమందు ఓంకారస్వరూపుడై వున్నాడు భగవంతుడు. పంచభూతములయందు, పరమాత్ముడు ఈ, ఈ రూపములతో వున్నాడు. కనుకనే, మనము ప్రపంచములోపల నిలిచి వుంటున్నాము. ఈ పంచభూతములూ సర్వులయందూ వుండటంచేతనే 'ఈశ్వరస్సర్వభూతానాం' అన్నారు.

అందరియందు భగవంతుడు వున్నాడంటున్నారే, అయితే ఎందుకు కనిపించటం లేదు. మద్రాసు దగ్గర, బొంబాయి దగ్గర పెద్ద సముద్రము వున్నది. ఒక గ్లాసునందు కొద్దిగా నీరుంటున్నాది. మరియొక కుండలో కూడా నీరుంటున్నాది. ఒక మురికి గుంటలోకూడా నీరుంటున్నాది. నీరు ఎక్కడెక్కడ వున్నదో అక్కడంతనూ సూర్య ప్రతిబింబము వుండియే వుంటున్నది. ఒక గ్లాసునందున్న నీటియందైనా సూర్యుడు సుస్పష్టముగా కనిపించుచున్నాడుగాని, ఇంత పెద్ద సముద్రమునందు సూర్యుడు సుస్పష్టముగా కనబడుటలేదే! కారణము ఏమిటి? సముద్రము క్షణమైనా విశ్రాంతిలేకుండా చలిస్తున్నాది. కనుక, సూర్యబింబము సుస్పష్టముగా కనిపించుటలేదు. గుంట, బావి కూడా వుంటున్నవి. అక్కడకూడను కనిపించటములేదు.కారణము ఏమిటి? పాచిపట్టి వుంతున్నది. బురదపట్టి నీరు వుంతున్నది. ఆ నీటియందుకూడను సూర్యబింబము సుస్పష్టముగా కనిపించటము లేదు. గంగా జలము అతి పవిత్రమైన జలము. కానీ, ప్రవహించటముచేత దానియందుకూడా సుస్పష్టముగా కనిపించదు. ఎక్కడ ఈ సూర్యబింబము సుస్పష్టముగా కనిపిస్తుంది? నిశ్చల, నిర్మలమైన జలములో మాత్రమే.

ఈనాడు మన హృదయాలలోని అలలో ఆత్మ కనిపించాలంటే ఎట్లా? కామక్రోధ, మదమాత్సర్యములూ, ఇంకా ఇంకా ప్లస్ ప్లస్ అన్ని గుణాలు పెట్టుకొని, పాచిపట్టి, కంపుగొట్టి బురదలో వుండిన ఈ హృదయమనే చెఱువులోపల ఆత్మ అనే ప్రతిబింబం ఎట్లా కనిపిస్తుంది? కనుకనే, చిత్తశుద్ధి చేసుకొని, తలంపులను అదుపులో పెట్టుకొని, నిశ్చలముగా, నిర్మలముగా వుంటున్న సమయంలో స్వస్వరూప సందర్శనము లభించును. ప్రకృతి అనే ఇది పరువులు తొక్కే ప్రవాహమేగానీ, చలనరహితమైన చెఱువు కాదు. క్షణక్షణమూ మారుతూ వున్నది. మార్పుచెందే జగత్తులో మార్పుచెందని మనస్సు సృష్టించుకోవాలి. మూడురకములైన మనస్సులు వున్నాయి. ఒకటి అకార, రెండవది వికార, మూడవది సకార. వీటికో తమస్సు, రజస్సు, సాత్వికముఅనికూడా పేర్లు పెడుతూవచ్చారు. అకార మనస్సు ఎల్లప్పుడూ ఎదుటివారి తప్పులను గురించే ఆలోచించే దుర్బుద్ధి. ఛీ! ఛీ! ఛీ! పరుల తప్పులను వెదకటము వలన వచ్చే లాభమేమి? పరుల దోషములను వెదికినంత మాత్రమున వచ్చిన ఫలితమేమి? ఇలాంటి కాలహరణమయ్యే కర్మలను చేసి ఏమి ప్రయోజనము? నా తప్పులను నేను వెతుక్కుంటాను, నా దోషాలను నేను తుడుచుకుంటాను అని గుర్తించి వర్తించినవాడు పూర్ణపరతత్త్వాన్ని పొందుతాడు.

ఇంక వికార మనస్సు. మంచిని చెడ్డగా, చెడ్డని మంచిగా భావిస్తుంది. ఒకరు ఎస్ అంటే వీడు నో అంటాడు. అయితే ఒక తమాషా. భోజరాజు కాలమునందు ఇద్దరు పండితులు వాదోపవాదములు చేసుకుంటూ 'మీమాంసము', 'మామాంసము' అంటూ కూర్చున్నారు. 'మీమాంస' అనగా తర్కము అనుకుంటారు. కాదు. యదార్థ విషయము పరిశీలన చేయటము. ఇద్దరు పండితులు, ఒకడు ద్విశిఖుడు, రెండవాడు పంచశిఖుడు. పంచశిఖుడు చెప్పినదంతా 'కాదు అని ఖంజిస్తానని' ద్విశిఖుడు వాగ్దానము చేశాడు. సరే! ఇతనికి సరియైన బుద్ధి చెప్పాలని పంచశిఖుడు సిద్ధమైనాడు. పంచశిఖుడు అడిగిన దానికంతనూ 'కాదు' అని చెప్పాలి ద్విశిఖుడు. పంచశిఖుడు మొట్టమొటి ప్రశ్న 'మా భోజరాజు మహారాజుయొక్క భార్య మహా పతివ్రత' అన్నాడు. అది కాదని ఎట్లా చెప్పగలడు? ప్రితదానికి కాదని చెబుతానని కూర్చుంటే ఎట్లాగు? దానికి సమయం సదర్భం చూసుకోవాలి. అన్నిటికీ కాదు. రెండవ ప్రశ్న వేశాడు. 'నీ తల్లికి నీవు కొడుకువు' అన్నాడు. అది కాదనటానికి వీలులేదే! ఇలాంటివారినే వికారమనస్కులని అంటారు. ఎవరేమి చెప్పినా దానిని ఖండించటం, ఖండించటం. వారికి నిత్య,అనిత్య పరిశీలనా జ్ఞానము శూన్యము. వ్యక్తిపైన ద్వేషము వుండవచ్చునుకాని, విషయముపైన పరిశీలన చేయాలి. నీకూ అతనికీ ఏమైనా కొన్ని అభిప్రాయబేధములు వుంటూవుండవచ్చు. కానీ, అతను చేసిన మంచిని కాదనటానికి అధికారము లేదు. విషయమునందు విరోధము వుండవచ్చుగాని అతను నీకు విరోధికాడు. ఈనాడు వికారమనస్సు మరింత పెరిగిపోయినది. వికారమనస్సు రజోగుణ తత్త్వము.

వికారమనస్సు విషసర్పము. అది తిన్నగా పోదు.మెలికలు తిరుగుతూ పోవును. వీరి బుద్ధులుకూడా ఎప్పుడూ తిన్నగా

పోవు. వంకరగానే పోవును. ఏది చిక్కితే దాన్నంతా కరుస్తూపోతుంది పాము. వీరు కూడా అంతే. ఏది చిక్కితే దానిని విరోధంగా తీసుకుంటారు. ఈ వికారమనస్సునకు సకారమనస్సును చేకూర్చాలి. ఏదో మనస్సు పోతూ వుంటుంది. వాంఛలు పెరుగుతూ వుంటాయి. తల నెరిసేకొద్దీ, పండ్లుపోయేకొద్దీ, కండ్లుచూపు తగ్గేకొద్దీ ఏదోఏదో ఇంకాఇంకా అనుభవించాలని ఆశపడుతుంటాము. ఇంతకాలం జుఱుక్రున్నదేమిటి వున్నదియ ఇకపైన జుఖ్ఖుకొనేదేమిటి వుంది? కనుక, మనకు ఆశవుండవలసినది ఒక్కటి. మానవుడిగా పుట్టాము. మానవునిగా జీవించాలి, ప్రవర్తించాలి. మానవునిగా చావాలి. మానవునిగా పుట్టి, మృగంగా చావటం మంచిది కాదు. ఈ సత్యాన్ని గుర్తింపజేసేది నిజమైన మనస్సు. నేను మనిషిని. నేను కేవలము ఒకవిధమైన మృగత్వముతో కూడినవాడిని కాను. కఠినత్వము మనిషియొక్క తత్త్వము కాదు. క్రూరత్వము మృగలక్షణము. అసూయ మృగలక్షణము. స్వార్థము వుండాలి, మితిమీరిన స్వార్థము మృగలక్షణమే. అహంకారము, కృతజ్ఞత లేకపోవటము మృగలక్షణమే. ఈవిధమైన లక్షణాలు పెంచుకొని మనుషులమనుకొంటే ఇది ఏమాత్రమూ అర్థవంతమైనది కాదు.

సహకారము, కరుణ. ఈ రెండు నేత్రములు పెట్టుకొని చూడాలి. నేడు, రేపు, మూడ దినాలు ముచ్చటగా కలిసేవారితో అనవసరమైన సంబంధబాంధవ్యాలు పెంచుకోకూడదు. నేడు, రేపు, ఎల్లుండి, జీవితమంతా మనతో కలిసి మెలసి వుండే దైవత్వముతో సంబంధబాంధవ్యాన్ని పెంచుకోవాలి. దైవము బయట ప్రదేశములో లేదు. తనయందే వున్నది. త్రిమూర్తిస్వరూపుడూ తానే, త్రికాలభోగ్యుడూ తానే. త్రినేత్రుడూ తానే. మృలక్షణాన్నంతా మనము పెట్టుకొ, 'జంతూనాం నరజన్మ దుర్లభం' అంటే వచ్చిన ఫలితమేమి.

ప్రేమస్వరూపులారా! మనం వుండే ప్రదేశం ఏమిటి? ఎవరెవరికి ఎంత ప్రాప్తియో అంతంతనే లభిస్తుంది. నీవు ఇతరులకు ఏది చేసెదవో, లేదా ఇచ్చెదవో అదే నీకు లభించును. ఎంత సమీపముగా, ఎంత సన్నిహితుడుగా వుండినప్పటికీ, తనకు ఎంత ప్రాప్తియో అంతే. గోవు పొదుగునందే ఎక్కువగా 'పిడుదు'లుంటాయి. కాని, ఈ 'పిడుదులు' రక్తాన్నేత్రాగుతాయిగాని, పాలు త్రాగటం లేదు. దూడ పాలే త్రాగుతుంది. కానీ, రక్తము త్రాగటం లేదు. మనము భగవంతుని బిడ్డలైన దూడలము కావాలిగానీ, పిడుదులు కాకూడదు. దగ్గరనే వున్నామంటే ఏమీ ప్రయోజనము లేదు. డియర్‌గా కూడా వుండాలి.

ఈనాడు మన భారతదేశము 'ఎవరికివారే యమునాతీరే' అన్నట్లు వున్నది. చేతిలో ఐదు వ్రేళ్లు వుంటే ఒకదానికి ఒకటి సంబంధముగా లేదు. నలుగురు ఇంటిలో వుంటే నాలుగు మార్గాలుగా వుంటున్నారు. చేరిక అనేదే లేదు. చేరిక లోపల ఎంత ఆనందముంది! ఐదు వ్రేళ్ళూ చేరితే ఎంత పని చేయవచ్చు. ఒక్క వేలితో అన్నము భుజించగలమా? ఐదు వ్రేళ్ళూ చేరితే ఐదు నిముషములలో పొట్ట నిండిపోతుంది. పదిమంది చేరితే పని పది నిముషములలో అయిపోతుంది. ఒక్కడే చేస్తే పది సంవత్సరములైనా చేయలేడు. 'కలసి వుంటే కలదు మోక్షం' అన్నారు.

మన భారతదేశములో డెబ్బది కోట్లమంది వున్నారు. ఈ 70 కోట్లలోపల I+you+you+you++++ పెట్టుకుంటూపోతే మనము ఎనితపనైనా సాధించవచ్చు. ఎంతఆనందాన్నైనా అనుభవించవచ్చు. ఇప్పుడు మనము అయ్లా చేయటము లేదు. father-son, husband- wife, guruji-sishya అన్నీ మైనెస్సులు పెట్టుకోబట్టే mindless అయిపోతోంది. ఇప్పుడు నేర్చుకోవలసినది ఏమంటే, first God, next world, last I... I means ego. కానీ, దురదృష్టవశాత్తు ఎట్లావుందంటే first I, next world, last God. ఈ స్థితిలో ఎన్ని నవరాత్రులు, ఎన్నివిధములైన కార్యక్రమములు జరుపుకున్నా ఒక్క అంగుళమైనా ముందుకు పోలేము. పల్లెలో మొహరములో 'హస్సన్, హుస్సేన్, హస్సన్ హుస్సేన్' అని ప్రజలు ఆడుతుంటారు. అక్కడే వుంటారు. కదలరు. ముందూ వెనుకలకు ఆడుతున్నాముగానీ ఒక్క అంగుళమైనా పోవటము లేదు. సాధన సమయంలో ముందుకూ, బయటకూ పోతూనే వెనక్కు ఈవిధంగా ముందుకూ, వెనక్కూ పోతున్నాము. అనగా, ఎంత ప్లస్ అవుతుందో అంత మైనస్ అవుతోంది.

దైవత్వాన్ని తెలుసుకోవాలంటే, అనుభవించాలంటే పెద్దలైనవారు మొట్టమొదట 'నిన్ను నీవు తెలుసుకో' అన్నారు. అంటే, ఎన్ని కాళ్లు, చేతులు, కళ్లు, ముక్కులు వున్నాయని కాదు. నేను ఎవరు? నేను దైవత్వాన్ని. నేను నిమిత్తమాత్రముగా ఈ దేహాన్ని ధరించాను. ఈ దేహములోని సర్వశక్తులూ, సర్వభావములూ, సర్వసంకల్పములూ భగవంతుని ప్రేరేపణతో వచ్చేవే అనే సత్యాన్ని గుర్తించాలి.

దివ్యాత్మస్వరూపులారా! ముఖ్యంగా ఎన్నో సంవత్సరములనుండియూ సాధనలు సల్పుతున్నాము. భజనలు చేస్తున్నాము. కానీ, అనుకున్నంత స్థాయిని అందుకోలేకపోతున్నాము. ఏది చేసినా, ఏది ఇచ్చినా, హృదయపూర్వకంగా చేయాలి. ఇష్టంపైన నీవు ఆధారపడితే స్వార్థమౌవుతుంది. దైవ ఇచ్ఛను అనుసరించాలి. దైవేచ్ఛయే మా ఇచ్ఛ అని నిర్ణయించుకొని మన కర్తవ్యాన్ని నిర్వహించాలి. ఒక గింజ వుంది. ఆ గింజను మట్టిలో పెట్టినాము. ఎరువు వేసినాము. నీరు పోసినాము. చక్కగా గాలి వచ్చేటట్లుగా చూచుకున్నాము. కొన్ని దినములకు అది ఏమైపోయింది. మొక్కగా మారినది. మనము పెట్టినది ఎక్కడ? మట్టిలో. ఆ విత్తనమేమైనా మట్టిగా అయిందా? మనం ఎరువు వేసినాము. విత్తనము ఎరువుగా అయిందా? నీరు పోసినాము. విత్తనమేమైమా నీరు అయిందా?

దానికి గాలి సోకింధి. విత్తనమేమైనా గాలి అయిందా? ఇంజనీరు విమానము కనిపెట్టినాడు. విమానమునంతనూ పూర్తి చేసినాడు. దానిలో కూర్చొని ఆకాశమునందు సంచరించుచున్నాడు. లోకజ్ఞానములోపల ఏమందురంటే, 'విమానము ఇంజనీరు నడుపుచున్నాడు' అంటారు. అనగా ఏమిటి? ఇంజనీరు విమానమునందు వున్నాడంటారు. కానీ, విజ్ఞానము అది ఒప్పుకోదు. 'విమానము ఇంజనీరులో వుంది' అని అంటుంది. విమానము ంజనీరును పుట్టించదు. ఇంజనీరు విమానమును పుట్టిస్తాడు. అది విజ్ఞానము. మూలాధారమైనదాన్ని గుర్తించటము విజ్ఞనము. బహిర్ముఖమైన దానిని వర్ణించటము జ్ఞానము. విజ్ఞానము, ప్రజ్ఞానము, సుజ్ఞానము, ఆత్మజ్ఞానము నాల్గింటియయందు మనము వుండికూడను, ఇంత అజ్ఞానములోమునిగిపోతున్నామంటే చెప్పుకోటానికే అవమానము.

ఈశ్వరుడు అనగా సకలైశ్వర్యము. విజ్ఞానాన్ని, ప్రజ్ఞానాన్ని, బ్రహ్మజ్ఞానాన్ని తానే ఇస్తున్నాడు. లోకజ్ఞానాన్నికూడా తానే ఇస్తున్నాడు. కనుక, త్రికూటస్థానమందున్న జ్ఞానేంద్రియములతో వుంది. తాను విష్ణుస్వరూపుడై జగత్తును వ్యాపిస్తున్నాడు.

ఈ సత్యాన్ని గుర్తించి, పవిత్రమైన ఈ రాత్రియందు హృదయపూర్వకంగా భగవత్సంకీర్తన చేసి, ధన్యులై, ఈశ్వరానుగ్రహముతో ఈశ్వరత్వాన్ని పొందుతారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

22.02.1982 మహాశివరాత్రి సందర్భముగా భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం.